ముక్కోటి బలగమోయి ...

కోటాయి ఓ కంబళీ, తుండుగుడ్డా బ్యాగులో సర్దుకుని హైదరాబాదుకెళ్ళే బండిలో ఎక్కాడు. పెట్టె నిండా జనం కిక్కిరిసుండారు. భారతదేశంలో రైలుబండ్లు బోల్తా కొడతానే వుండయి. వందలకు వందలు జనం చస్తానే వుండారు. కాని ప్రజలు రైలు ప్రయాణాలు మానారా? జనాన్ని అటీటు తోసుకుని, బ్యాగు సంకన గట్టిగా అదిమి పట్టుకుని పెట్టెలో ఓ మూలన నిలుచున్నాడు కోటాయి.

కోటాయి సెక్రెటేరియటు ప్యూను. కర్నూలు నుంచి హైదరాబాదుకు తరలిస్తున్న ఆపీసుల్లో తనదొకటి. సూపరింటు సుందర్రామయ్యా, యూడీసీ వెంకటప్పయ్యా వారం రోజుల ముందే ఆఫీసు సామాన్లు ఓ వాగెనులో నింపుకుని హైదరాబాదుకు చేరుకున్నారు. కోటాయి తనూరికి పోయి, విశాలాంధ్రమొచ్చిన సంగతీ, తాను హైదరాబాదురెళుతున్న సంగతీ భార్యాబిడ్డలకు చెప్పి ఆలస్యంగా బయల్దేరాడు. ఎట్టాగయినా ఫస్టు నవంబరు నాడు పది గంటలకి ఆఫీసుకు జేరుకోవాలి. తెల్లారేసరికి హైదరాబాదుకు చేరుతుందన్నారు బండి. అందులోనే ఎక్కాడు.

ఉండి ఉండి కోటాయి కళ్ళ మీదికి నిద్ర కప్పుకొస్తోంది. ఉలిక్కి పడి కళ్ళు నలుచుకొని మళ్ళీ సరిగ్గా నిలుచుంటున్నాడు. ఇలా లాభం లేదని, జేబులో ఉన్న మాంచి ఘాటైన లంక పొగాకు సుట్టోటి దీసి అంటించాడు. సుట్ట కాలుస్తున్నా కొద్దీ ఒక్కొక్క దమ్మే ఆ పొగ పీల్చి వదుల్తా వుంటే కోటాయి మెదడులో ఏవేవో ఆలోచనలు రాసాగినయి.

తెలంగాణావోళ్ళు తన్ను ఎన్ని అగచాట్లు పెడతారోననే భయం గబుక్కున కోటాయికి దట్టింది. తానా మధ్యన పేపర్లో చదివిన సంగతులు జ్ఞాపకానికి రాసాగినై. "ముల్కీ -

Scanned by CamScanner

నాన్ముల్కీ అని ఏదో అల్లరి జేసి, పొట్ట కూటికి తమ పుట్టినూరినీ, ఇంటినీ వదిలి, ఆంధ్రదేశం నుంచి వచ్చి హైదరాబాదులో కాపురం పెట్టుకున్న తన బోటి వాళ్ళని ఎక్కడ బడితే అక్కడ దొరికించుకుని తన్నారట. వాళ్ళకు ఆలోచనే లేదట. ఇక తన్నటం మొదలుపెడితే పెద్దా చిన్నా చూడకుండా – బొక్క లిరిగేట్టు తన్నడవేనట. అక్కడి తెలుగు వారు కూడా తురకం మాట్లాడుతారుట!" అంటూ తన వాళ్లు, పత్రికలు, అప్పుడప్పుడూ కొన్ని సంవత్సరాల నుంచీ, తెలంగాణా ప్రజలను గురించి తనకు కలిగించిన, తన మనస్సులో బాగా నాటుకుపోయిన తెలంగాణాలోని తెలుగు వారిని గురించిన తప్పుడు అభిప్రాయాలతో తాను వెళ్ళబోతున్న దేదో నరకమన్నట్టు, అక్కడి వాళంతా యమదూతలన్నట్టూ భావించుకుంటూ, ఉలికులికి పడుతున్నాడు కోటాయి. బండి మహబూబానగరం స్టేషను దాటింతర్వాత కొంత స్థలం దొరికింది కోటాయికి కూర్చోడానికి. బ్యాగును మోకాళ్ళ మీదేసుకుని తలకాయ దాని మీద పెట్టి నిద్రపోయాడు.

ఏదో ఒక స్టేషనులో ఎవరో లేపారు కోటాయిని, 'లేవండి తెల్లారింది' అని. కోటాయి. గబుక్కున లేచి బ్యాగు చూసుకుని, కళ్ళు నలుచుకుని చక్కగా కూచున్నాడు. ఆ లేపినాయన కోటాయిని, పేరూ ఎక్కడి నుంచి ఎక్కడికి ఎందుకు వెళుతున్నదీ వివరాలడిగాడు. చుట్ట దీసి కోటాయి కొకటిచ్చి, తానొకటి నోట్లో పెట్టుకుని కాల్చాడు.

"మీ పేరేటండీ?" అడిగాడు కోటాయి.

"రామప్పంటారు. హైదరాబాదే. ఇది నా అడ్రసు. దగ్గరబెట్టుకో. ఎప్పుడన్న ఏమన్న గావలసి వస్తే రా" అని విజిటింగ్ కార్డు ఇచ్చాడు.

ఆ విజిటింగ్ కార్డు మీద "డా. రామప్ప, ఎమ్.బి.బి.ఎస్ బషీర్‌బాగ్, హైదారబాదు –1" అని చదివి కోటాయి ఆశ్చర్యపోయాడు.

"అసలు మీది ఈ వూరేనా? లేక మన ప్రాంతం నుంచి ఇక్కడకొచ్చి స్థిరపడ్డారా?' అని అడిగాడు కోటాయి. ఈ ప్రశ్న వెనుక కోటాయిలో ఎన్ని సందేహాలు నాట్యం చేస్తున్నాయో డాక్టర్ రామప్ప గమనించక పోలేదు. "ఇవన్నీ మన ప్రాంతాలే. ఇన్నాండ్లు మీ మనస్సులో ఉన్న మీ తప్పుడు అభిప్రాయాలను మార్చుకోవాలె. నాది ఖాస హైదరాబాదే" నన్నాడు. ఇంతలో స్టేషన్లో బండాగింది. 'హైదరాబాదు' 'కాచీగూడా' అని అరుస్తున్నారు.

రామప్ప కోటాయీ దిగారు. రామప్ప కోటాయిని తన వెంట రమ్మని, తనతో బాటు కోటాయిని కోఠీదాకా నడిపించుకొచ్చి, సెక్రెటేరియటు కెళ్ళాలని కోటాయంటే అక్కడ ఎనిమిదో నెంబరు బస్సు కోటాయి నెక్కించి తాను ఏడవ నెంబరు బస్సు ఎక్కి ఇంటికి చేరుకున్నారు.

బస్సు రెండో అంతస్థులో కూర్చుని చూస్తున్న కోటాయికి హైదరాబాదు నగరం గమ్మత్తుగా కనబడుతోంది. కండక్టరుకు డబ్బులిచ్చి టిక్కెట్టు కొన్నాడు. సెక్రెటేరియటు

Scanned by CamScanner

కని. అబిడ్స్, నాంపల్లి, లకిడీకాపుల్, బస్సు పోతూంది. బస్సాగినప్పుడల్లా కోటాయి కండక్టరు నడుగుతూనే ఉన్నాడు. సెక్రెటేరియటు కెక్కడ దిగాలని. సెక్రెటేరియటు రాగానే కండక్టరే కోటాయిని 'ఇదే సెక్రెటేరియటు' అని చెప్పి దించాడు.

కోటాయి బస్సు దిగాడు. అటూ ఇటూ పరికించాడు.

ఎక్కడా 'సెక్రెటేరియటు' అనే బోర్డు చిన్నదిగాని పెద్దది గాని కనిపించలా. అట్లా బేలిపోయి చూస్తుంటే 'ఏంరోయి కోటాయి, ఈ బండికేనా వచ్చింది?' అనే కేక విని, అటేటుచూశాడు. ఎక్కడ చూసినా తన ప్రాంతం నుండి వచ్చిన వాళ్ళు గుంపులు గుంపులుగా చేరి ఉండటం చూచి కోటాయెందుకో ఉబ్బిపోయాడు.

'ఇక్కడా, ఇక్కడా' అని మళ్ళీ కేక వినిపించేతరికి ఆ వైపు చూశాడు. తన ఆఫీసుప్యూను బలరామయ్య. గబుక్కున పరుగెత్తాడా వైపుకు. మధ్యన కారొస్తున్నది కడా గమనించకుండా. కొద్దిలో తప్పించుకున్నాడు గాని లేకపోతే యాక్సిడెంటే. బలరామయ్యది కర్నూలే.

మెద్రాసు నుంచి తనాఫీసు కర్నూలుకు తరలించబడ్డాక ఉద్యోగంలో చేరాడు ప్యూనుగానే. నిన్నగాక మొన్న ఇద్దరూ కర్నూలు వీధుల్లో తిరిగారు. మళ్ళీ ఇవాళ, ఎంతో కాలం విడిపోయిన ఆప్తులవలె అప్యాయంగా కలుసుకొని ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నారు. వారు మాట్లాడుకున్న విషయాల్లో ముఖ్యమంత్రి ఎన్నిక దగ్గర్నుంచి హొటల్సులో కాఫీకి ఉన్న ఎక్కువ ధర దాకా ఉన్నాయి. బలరామయ్య కోటాయిని తీకుకెళ్ళి తమ కోసం కేటాయించిన ఆఫీసు గదులెక్కడున్నదీ చూపించాడు. సెక్రెటేరియటు భవనం చూస్తూ, కోటాయి ఉప్పొంగిపోతున్నాడు.'మెద్రాసిడిచినా, దానబ్బలాంటి పట్నం సంపాదించుకున్నాంలే' అన్నాడు.

ఇంకా ఆఫీసు గదులకి తాళాలు తియ్యలేదు.

"మనకి సన్నతు నగరుట. ఆడ ఏర్పాటు చేసినారు ఆస్టలు" అని సనత్‌నగర్‌కు ఎట్లా వెళ్ళాలిసిందీ వివరించి చెప్పాడు బలరామయ్య.

'ఔనుగాని ఈ ఊరోళ్ళు మంచివాళ్ళేనా?" అనడిగాడు కోటాయి బలరామయ్యను.

తాను రైల్లో ఎక్కుతుండగా కలిగిన సందేహానికి సుస్పష్టమైన సమాధానం పొందాలన్న ఆశతో.

'ఏహె మంచేటి? మంచి ఆడుండాదిలే. నైజాం కాలేజి. ఆ కాలేజి కుర్రోళ్ళు నిన్న కార్లని ఆపి టపాకాయలు పేల్చినారంట. కారు మీద నంబరు సూడ్దంవట. అది మన ప్రాంతం కారు అని తెలిసిపోంగనే ఆటిని ఆపటవట. అద్దాలు పగలుగొట్టడం, గాలి తీసేయటం, టపాకాయలు కొట్టడం, శానా బాధ పెట్టినారంటలే-" అని చెప్పుకుపోయాడు బలరామయ్య. "అయితే ఈళ్ళతోటి జాగ్రత్తగానే ఉండాలే?" అంటూ

Scanned by CamScanner

"అస్టలేపు వెళ్లొస్తా. సుందర్రామయ్యగారికి, ఎంకటప్పయ్యగారికి చెప్పు..." అని బయల్దేరినాడు.

సనత్‌నగర్‌కు వెళ్లే విధానం, బలరామయ్య వివరంగా చెప్పాడు గనుక, కోటాయి కాట్టే కష్టం కలుగలేదు. బస్సులో కోటాయికి ఎన్నో ఆలోచనలు వచ్చాయి. 'రామప్పగారు అంత మంచిగా ప్రవర్తించారే, మరి ఇక్కడి వాళ్ళు కాదంటాడేమిటి బలరామయ్య? - బలరామయ్య అబద్ధమెందుకు చెబుతాడు? మరి రామప్పగారు మంచిగా ప్రవర్తించిన సంగతి తనకే అనుభవమాయె. ఇంతకూ ఇక్కడి వాళ్ళు మంచివాళ్ళా? కాదా? అనే సంగతి కోటాయి ఇదమిద్ధంగా తేల్చుకోలేక పోయాడు. సనత్‌నగర్‌కి వెళ్ళి తన కోసం ఏర్పాటు చేయబడ్డ చోటును చూసుకుని, మళ్ళీ పదకొండు గంటలకల్లా తిరిగి ఆఫీసుకు చేరుకున్నాడు. ఆఫీసు కెళ్ళగానే సుందర్రామయ్యా, వెంకటప్పయ్యలు కోటాయి నాహ్వానించారు. రిజిస్ట్రారుగారి రూము చూపించి అక్కడ తన పేర్రాయించుకుని సంతకం పెట్టి రమ్మన్నారు. అక్కడ ఆ ఫార్మలిటీస్ అన్నీ ముగించుకున్నాక, సుందర్రామయ్య గారి ప్రక్కన నిలుచుని, నమస్కరించి సవినయంగా నుంచున్నాడు కోటాయి. సుందర్రామయ్య కోటాయిని చూసి, ఓ కవరు చేతికిచ్చి దాన్ని చీఫ్ సెక్రెటరీగారికిచ్చి రమ్మన్నాడు. 'వచ్చాడో లేదే అప్పుడే పని జెపుతాడేటీ సుందర్రామయ్య?' అని కోటాయి కడుపులో మండింది. కానేం జేస్తాడు? ప్రభుత్వోద్యోగమాయె తప్పుతుందా మరి?

"ఎట్టా ఎల్లాలీ? దారి తెలీదుగా?" అన్నాడు కోటాయి. నసుగుతూ.

"అడుగుతే ఎవరన్నా చెపుతారు. బేగంపేట వెళ్ళే బస్సెక్కి వెళితే అదే వస్తుంది. పో"మ్మన్నాడు సుందర్రామయ్య.

కోటాయి మాట్లాడకుండా బయలుదేరాడు. సుందర్రామయ్యను మనసులో తిట్టుకుంటూ 'యదవ ఆంబోతు మొగం ఈడూనూ. ఎప్పుడొచ్చావనన్నా అడగడేం? మనిషి కనపడితే ఇగ పని జెప్పటవేనా" అనుకుంటూ తన నడక సాగించాడు. దారిలో మళ్ళీ రామప్పగారు కనిపిస్తే దారడిగాడు. రామప్పగారు బేగంపేటకు పోయే బస్సు ఆగే చోటు చూపించి , 'అక్కడ నిలబడు. చిన్న సింగిల్ డెక్కర్ బస్సు వస్తది. ఎక్కి కండక్టరు నడిగి చీఫ్ సెక్రెటరీగారింటికి పోవడానికి ఎక్కడ దిగమంటే అక్కడ దిగు. మంచిగా వినయంగా అడుగుతే ఈవూరివాండ్లు చెప్పుతరు. గర్వంతోటి మాట్లాడితివా - సహించరు' అని రామప్పగారు వెళ్ళిపోయారు. రామప్పగారు చెప్పిన ప్రకారమే బస్సు ఎక్కి, చీఫ్ సెక్రెటరీగారికా ఉత్తరం అందించి, తిరిగి ఆఫీసుకు చేరుకున్నాడు కోటాయి.

ఆఫీసుకు చేరుకున్నాక, కోటాయి బలరామయ్యను పిలుచుకుని అడిగాడు. తన్ను బస్సులో బాధించిన సందేహానికి సమాధానం.

Scanned by CamScanner

"అసలీ వూరువాళ్ళు మంచివాళ్ళేనా?" అని. "అప్పుడే చెప్తిని గదా?" అన్నాడు బలరామయ్య తాను ఇక్కడి వాళ్ళను చెడ్డవాళ్ళేనని నిర్ణయించుకున్న నిర్ణయం అబద్ధం కాదనే మాటను పునరుద్ఘాటించుకుంటూ. కోటాయి రామప్పగారి సంగతి చెప్పాడు. బలరామయ్యకు నమ్మకం కుదరలే. బలరామయ్యకూడా ఆలోచించాడు. ఆలోచించి వెంటనే ఒక నిర్ణయానికొచ్చాడు. గవర్నమెంటుతో అవసరమున్న వారు, గుమాస్తాలూ, ఉద్యోగులు, బాగా చదువుకున్నవారూ, నాయకత్వం కోసం పాటుపడే వారు మాత్రమే తమతో మంచిగా ప్రవర్తిస్తున్నారని, ఆ మంచితనం స్వార్థంతో కూడుకున్నదనీను, కోటాయికి వాదంలో సబబు కనిపించినా వెంటనే విశ్వాసం కలుగలా. "రామప్ప గారు డాక్టరు. ఆయనకేం స్వార్థం ఉంటుంది?" అనడిగాడు.

"డాక్టరేనేమొ? కాని బహుశా నాయకత్వం కోసం పాటుబడే వాడయ్యుంటాడు. ఖద్దరు కట్టాడా'" కోటాయి జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. రామప్పగారి రూపం. అవును ఖద్దరే కట్టినట్టున్నాడు. బలరామయ్య మాటల్లో విశ్వాసం కుదిరింది కోటాయికి. తమంటే ఇక్కడి వాళ్ళు భయపడాలనుకున్నాడు కోటాయి. రామప్పగారి మీద కోటాయికి కలిగిన గౌరవమంతా పటాపంచలైపోయింది.

"నెహ్రూగారి మీటింగెక్కడా?" అడిగాడు కోటాయి మాట మారుస్తూ.

"ఫతే మైదానంలో – అటేపు కెళితే వస్తుంది." అప్పటికే మూడయింది. కోటాయి సుందర్రామయ్యకు చెప్పి, ఈ పూటకు తన్నిడిసిపెట్టుమని సెలవు తీసుకుని ఫతే మైదానంవైపు నడిచాడు.

కర్నూల్లో కోటాయి బండెక్కినప్పుడు హైదారాబాదువారంటే క్రూరులని భయపడ్డాడు. తన్నేం చేస్తారో ఎన్ని తిప్పలు పెడతారోనని ఆరాటపడ్డాడు. బండిలో కూడా అవే ఆలోచనల్తో సతమతపడ్డాడు.

రామప్పగారిని చూసింతర్వాత, కోటాయికాభయం విచ్చుకు పోయింది. హైదరాబాదు వాళ్ళు చాలా మంచి వాళ్ళనే అభిప్రాయం కలిగింది. సుందర్రామయ్యగారి ప్రవర్తనను చూసింతర్వాత కోటాయికి కలిగిన ఈ అభిప్రాయం మరీ గట్టిపడ్డది. సుందర్రామయ్య తన్ను విచారించనే లేదు. మరి రామప్పగారెంత మంచిగా ఆదరించారు? సుందర్రామయ్య కంటే రామప్పగారే వెయ్యి రెట్లు నయమనే అభిప్రాయం కలిగింది. తెలుగువాళ్ళందరిదీ ఒక్క కుటుంబంఅనే మాట నిజమేననుకున్నాడు. కాని బలరామయ్య మళ్ళీ కోటాయి ఆలోచనల్ని మార్చాడు. దానికేదో కారణముందని ఊహించి కోటాయిని కూడా తన లాగే ఊహించేట్టు చేశాడు. కోటాయిలో ఇప్పుడు ఎన్నడూ లేని గర్వం ప్రవేశించింది. ఆ గర్వంతో ఆనందం కలిగింది. ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని విన్నప్పుడు కొందరికి ఈలాంటి

Scanned by CamScanner

ఆనందమే కలిగి ఉంటుంది. ఇక్కడి వాళ్ళందరినీ తానే ఏలుతున్నాననుకున్నాడు. సుందర్రామయ్యలాంటి అధికార్లు తన్ని పెట్టే కష్టాలు మరచిపోయి. తానూ, సుందర్రామయ్యా, బలరామయ్యలూ కలిసి హైదరాబాదు వాళ్ళ మీద రాజ్యం చేస్తున్నట్టు భ్రమపడ్డాడు. నైజాంను గద్దె దించింది తానే ననుకున్నాడు. ఆ గద్దె తన కోసమే ఖాళీ అయిందనుకున్నాడు. ఇట్లా అనేక విధాలుగా అనుకుంటూ ఫతేమైదానం చేరుకున్నాడు కోటాయి. అన్నీ గళ్ళు గళ్ళుగా కట్టారు. పోలీసు లెక్కడి వారి నక్కడ కూచో పెడుతున్నారు. దారులు చూపిస్తున్నారు. దూరంగా ఓ వింగులో ఓ మూల కూచొని, జేబులో మిగిలిపోయిన మరో లంక పొగాకు చుట్ట అంటించుకున్నాడు. మూడున్నరయిందప్పటికి. ఇంకా మూడు గంటలు గడవాలి. అప్పటిదాకా ఓ నిద్ర తీద్దామనుకుని అక్కడే వాలాడు కోటాయి. బ్యాగులో కంబళిని పరుమకుని, తుండు గుడ్డ నెత్తికి చుట్టుకుని, బ్యాగును తలకింద పెట్టుకుని బాగా అలసిపోయాడేమో వెంటనే నిద్ర పట్టింది.

"ఏమండీ, లెవ్వండి, లెవ్వండి, కూర్చోండి" అని ఎవరో లేపేసరికి ఐదున్నరయింది. జనం నిండుతున్నారు. తన చుట్టూ చాలా మంది ఈ వూరి వాళ్లే చేరారు. తన ఊరూ వివరాలడిగారు. తాను చెప్పిందంతా విసుగు లేకుండా విన్నారు. తాను తనకు లేనిపోని గొప్పతనాల్ని చెప్పుకుపోతుంటే అవన్నీ విని నిజమేననుకుని నమ్మి 'ఓహో' అన్నారు. పక్క నుండి ఓక ఆసామి కోటాయికి ఓ చుట్ట ఇచ్చి చుట్ట కాల్చండి అన్నాడు. కోటాయి చుట్ట తీసుకుని నోట్లో పెట్టుకుని, తన జేబులోంచే అగ్గిపెట్టె తీసి గీసి, తన చుట్టతోబాటు ఆ ఆసామీ చుట్ట గూడా వెలిగించాడు. కోటాయడిగాడు "మీపేరేంటి?" అని, ఆ ఆసామిని. 'కోటయ్య' అని చెప్పాడా ఆసామి. తమ ఇద్దరి పేర్లూ ఒక్కటే కావడంతో ఆ యిద్దరికీ కలిగిన సంతోషానికి మేర లేదు. ఇద్దరివీ తనువులు వేరైనా ఇద్దరూ ఒకటే ననుకున్నారు. ఇంతలో ఎవరోవస్తే కోటయ్య కొంచెం పక్కకు తొలిగాడు.

నెహ్రూగారు వచ్చారు. సూర్యకుమారి పాట పాడింది. ముందరున్న పిల్లలు కొంతమంది మోకాలి మీది దాకా నిక్కి చూస్తున్నారు.

"ఏయె, కూచోండి కూచోండి" వాళ్ళు కూచున్నారు.

'నైజాం వాళ్ళంతా వట్టి దద్దమ్మలనీ, తానేం చెపితే అది నమ్ముతారనీ,' తనకిందాకా కలిగిన అభిప్రాయం వాళ్ళు తన ఆజ్ఞను కూడా పాలించటంతో దృఢపడ్డది. తమను చూసి నైజాం వాళ్ళు భయపడుతున్నారనీ, అందుకని వాళ్లే తమకు లొంగి ఉంటారనే నిర్ణయానిక్కూడా వచ్చాడు కోటాయెప్పుడో.

నెహ్రూగారు ఉపన్యాసం ప్రారంభించారు. ముందున్న పిల్లలు మళ్ళీ తలలు నిక్కించారు. కోటాయి మళ్ళీ కేకేశాడు, 'కూచోండమ్మాయిలూ కూచోండ'ని. వాళ్ళు మళ్ళీ

Scanned by CamScanner

కూచున్నారు. ఈ తతంగం ఇట్లా నాలుగైదు సార్లు సాగేసరికి ప్రక్కనే ఉన్న ఒక ఆసామీకి కోపం వచ్చింది. ఉపన్యాసం స్పష్టంగా వినపడుతూనే ఉంది. నెహ్రూ గారెట్లాగూ కనపడ్డం లేదు. ఈనిట్లా అరవటం ఆ ఆసామీకి నచ్చలేదు. "ఉపన్యాసం ఇనకుండ ఏందా అరుపులు" అని కోటాయిని మందలించాడు. కోటాయిక్కోపం వచ్చింది. ఇందాకా అనుకున్నాడుగా, తమంటే వీళ్ళు భయపడాలనీ, లొంగి ఉండాలనీ" "ఏంటయ్యా నువ్వనేదీ, అందర్నీ నంచోమంటావేటీ?" అన్నాడు. ఆ ఆసామీని దబాయిస్తూ, ఇప్పుడింత మందిలో ఇదో అల్లరెందుకని ఆ ఆసామీ తప్పించుకున్నాడు 'నిన్నుగాదు లేమ'ని. 'ఏదీ, ఏందో వాగుతున్నావేటీ?' ఎదుటివాడు తనకు భయపడి లొంగిపోతున్నట్టు గ్రహించి 'ఏయి జాగర్త ఏమనుకున్నావో ఎక్కువ తక్కువొాదిరితివా బొక్క లిరుగుతయి మల్ల – ఏంవా. పోనీ లేమ్మని ఊకున్నా కొద్దీ నీలుగుడు శానయిందే."

ఈ వాదం విని ప్రక్క నుంచో రూమీ టోపీ, 'మ్మరోస్సలేకూ' అంటూ మాయమైంది.

కోటాయి లేచి 'కొడతావేటీ?" అంటూ ఆ ఆసామీపై కురికాడు.

"అంతకాడికి దెస్తె ఆ పని గూడయిద్ది మల్ల" అంటూ ఇతనూ లేచాడు. చుట్టూ జనం లేచారు.

కోటాయి చెంప చెళ్ళుమన్నది. అటీటు చూస్తు వుండగానే మరో చెంప చెళ్ళు మన్నది. తల మీద బలమైన దెబ్బ తగిలింది. పోలీసులు వెంటనే వచ్చి కోటాయినొక వైపూ ఆ ఆసామీనొకవైపూ తీసుకువెళ్ళి ఫతేమైదానం ఆవరణ బైట విడిచారు.

రెండు చెంపలూ చుర్రకుమంటూ జవజవలాడుతున్నాయి. నెత్తికి కొద్దిగా గాయం తగిలి రక్తం కారుతోంది. ఎటు పోవాలో తోచలేదు కోటాయికి. మనసులో ఏదో తిట్టుకుంటూ ముందు కడుగేయబోయాడు. పొద్దట్నుంచీ తినలేదేమో ఆయాసమైంది. కళ్ళు బైర్లు క్రమ్ముకున్నాయి. ఫుట్‌పాత్ మీదే కంబళి పరుచుకుని తుండుగుడ్డ తలకు చుట్టుకుని అక్కడే వాలాడు కోటాయి.

కోటాయి లేచేసరికి మంచంలో ఉన్నాడు. ప్రక్కన కోటయ్య కూచుని వున్నాడు. కోటాయి ఆశ్చర్యపోయాడు. ఈ ఆశ్చర్యాన్ని గమనించి కోటయ్య చెప్పాడు. అది డాక్టర్ రామప్ప గారి ఇల్లనీ, తానే అక్కడికి కోటాయిని చేర్చాననీ, చాలా మంది బీదవాళ్ళకు రామప్పగారు ఉచితంగా వైద్యం చేస్తారనీను. ఇంతలో రామప్ప గారు కూడా వచ్చారు లోపల్నుంచి. "గాయం ఏమంత పెద్దది కాదులే. ఈ కట్టు మూడు రోజుల్దాకా విప్పకు – అన్నం తినలేదుగా, వద్దనయింది. తిందు గాని పా, కోటయ్యా నువ్వు కూడా లేచి కాళ్ళు కడుక్కో"మన్నారు రామప్పగారు. ముగ్గురూ ఒకే పంక్తిలో కూచుని భోజనాలు చేశారు.

భోజనాలయింతర్వాత డాక్టరుగారింట్లో రేడియోలో –

Scanned by CamScanner

"ముక్కోటి బలగమోయి ఒక్కటై మనముంటె
ఇరుగుపొరుగూలోన ఊరు పేరుంటాది
తల్లి ఒక్కటె నీకు తెలుగోడా....
సవతిబిడ్డల పోరు మనకేలా?...
అనే పాట వినిపించింది.

ఆ పాటనే మనస్సులో ఆలాపించుకుంటూ కోటయ్యా కోటాయిలు డాక్టరుగారి నుండి సెలవు పుచ్చుకున్నారు.

(ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంలో శ్రీ బుచ్చిబాబుగారి అధ్యక్షతన సికిందరాబాదులో ఏర్పాటు చేయబడిన కథక సమ్మేళనంలో 4 నవంబరు, 1956 నాడు చదినన కథ.)

– తెలుగు స్వతంత్ర, 14–12, 1956.
– కరీంనగర్ జిల్లా కథా సరిత్యాగరం

Scanned by CamScanner